

రిమ్స్‌ను వీడని నిర్లక్ష్యపు జబ్బు

జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకమైన కడప రిమ్స్ ఆసుపత్రిలో అడుగడుగునా నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కొందరు వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. - 8లో



మాయ మాటలతో బంగారం చోరీ

జమ్మలమడుగు పట్టణంలో ఎస్సీ కాలనీలో కరపాకుల సుజాత అనే మహిళకు మాయ మాటలు చెప్పి బంగారాన్ని చోరీ చేసిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం
40.0 /26.8

వాతావరణం

జిల్లాలో సోమవారం 26.8 – 40.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

అభ్యంతరాలను 24 లోపు సమర్పించాలి

– పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శ్యామ్యుల్

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ పరిధిలోని అనంపురం, చిత్తూరు, కడప, కర్నూల్ పూర్వపు జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్(గవర్నమెంట్) నుంచి (గ్రేడ్ –2 ప్రధానోపాధ్యాయ పోస్టులకు సవరించడానికి తాత్కాలిక జాబితాను htppr://rjdrekadapa.bofrpot.comలో ఉంచినట్లు పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శ్యాముల్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో తగిన ఆధారాలతో ఈ నెల 24వ తేదీలోల సమర్పించాలని సూచించారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

– 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో ఎస్.పి ఈ.జి అశోక్ కుమార్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించి న్యాయం చేయాలని జిల్లా ఎస్.పి ఈ.జి అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి, వారి సమస్యను విన్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసి, వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులకు సిబ్బంది తమ వంతుగా సహాయం చేసి ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి కృషి చేశారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్ బాబు, డి.టి.సి డి.ఎస్పీ అబ్దుల్ కరీం పాల్గొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు 178 ఫిర్యాదులు వచ్చాయి.

పరీక్ష ఫీజు చెల్లింపునకు నేడు ఆఖరు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా మే 12వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు సంబంధించిన పరీక్ష రుసుము చెల్లించుటకు మంగళవారం తో గడువు ముగుస్తుందని ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన, ఇంప్రూమెంట్ రాయు విద్యార్థులు వెంటనే పరీక్ష రుసుము సంబంధించిన కళాశాలలో చెల్లించాలని తెలిపారు. ఏదైనా ప్రైవేట్ జూనియర్ కళాశాల యజమాన్యం విద్యార్థుల ఫీజు బకాయి సాకు చూపుతూ కట్టించుకోకుంటే ఆయా కళాశాలలపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పదోన్నతి కౌన్సెలింగ్ ప్రశాంతం



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కడప రూరల్ : వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో సోమవారం స్టాఫ్ నర్స్ నుంచి హెడ్ నర్సులుగా చేపట్టిన పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 15 మందికి గాను 9 మంది పదోన్నతులు పొందారు. నిబంధనల ప్రకారం ప్రమోషన్ల కౌన్సెలింగ్ ను చేపట్టినట్టు ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ డీఐఈఓగా సత్యనారాయణరెడ్డి


కడప ఎడ్యుకేషన్ : డిస్ట్రిక్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్(డీఐఈఓ)గా సత్యనారాయణ రెడ్డిని నియమిస్తూ విద్యాశాఖ సెక్రటరీ కొన శశిదర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌టీఆర్ జిల్లా పయాకపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఈయన్ను వైఎస్సార్ జిల్లా డీఐఈఓగా నియమించారు. గతంలో డీవీఈఓగా పనిచేస్తున్న శ్రీనివాసులరెడ్డి ఉద్యోగ విరమణ చేయడంతో కడప ఆర్ఐవోగా పనిచేస్తున్న బండి వెంకటసుబ్బయ్య డీవీఈఓగా ఉన్నారు.

ఇంటర్ ఆర్‌జేడీగా శ్రీనివాసులు...

ఇంటర్మీడియట్ ఎఫ్ఏసీ ఆర్‌జేడీగా శ్రీనివాసులును ప్రభుత్వం నియమించింది. ఈయన ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా డీకే గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. చిత్తూరు డీఐఈఓగా నియమించిన శ్రీనివాసులను ఎఫ్ఏసీ ఆర్‌జేడీగా కడపకు నియమించారు. ప్రస్తుతం కడప ఆర్‌జేడీగా పనిచేస్తున్న రవిని రాయచోటి డీఐఈఓగా నియమించారు.

సన్నద్ధతకు సమయమేదీ!

- డీఎస్సీ సన్నద్ధతకు కేవలం 45 రోజులే గడువు
- ప్రిపరేషన్‌కు 3 నెలల గడువు అవసరం అంటున్న సబ్జెక్టు నిపుణులు



డీఎస్సీ కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు

కడప ఎడ్యుకేషన్ : డీఎస్సీ అభ్యర్థుల్లో కలవరం మొదలైంది. నోటిఫికేషన్‌కు.. పరీక్షలకు మధ్య గడువు 45 రోజులు మాత్రమే ఉంది. ఇంత తక్కువ సమయంలో పరీక్షలకు సన్నద్ధం కావడం సాధ్యం కాదనే ఆందోళన అభ్యర్థుల్లో మొదలైంది. ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తోందని సంతోషించాలో సన్నద్ధమయ్యేందుకు కనీస గడువు ఇవ్వకుండా హడావుడిగా షెడ్యూల్ జారీ చేసినందుకు బాధపడాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. డీఎస్సీ పరీక్ష సన్నద్ధమయ్యేందుకు 45 రోజులు సమయం సరిపోదని సబ్జెక్టు నిపుణులు సైతం అంటున్నారు.

దరఖాస్తులో ఇవ్వని ఎడిట్ ఆప్షన్....

పరీక్ష కోసం దరఖాస్తు చేసుకునేందుకు చాలా రకాల పత్రాలను అడిగారని వాటిని సమకూర్చుకునేందుకే వారం పది రోజులు సమయం పడుతుందని అభ్యర్థులు వాపోతున్నారు. దీంతోపాటు దరఖాస్తు చేసుకునే సమయంలో చాలా జాగ్రత్తగా చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొనడంపై అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. దరఖాస్తు సమయంలో ఏదైనా పొరబాటు జరిగితే ఎడిట్ చేసుకునేందుకు ఆప్షన్ ఇవ్వలేదని డీఎస్సీ అభ్యర్థులు తెలిపారు. దీనికి తోడు డీఎస్సీ పరీక్ష రాసే అభ్యర్థులకు డిగ్రీలో కనీసం 45 శాతం మార్కులు ఉండాలనే నిబంధన పెట్టారని గతంలో 40 శాతం మార్కులే ఉండేవని దానిని ఈ కూటమి ప్రభుత్వం 45 శాతానికి పెంచారని వాపోతున్నారు. ఇన్ని రకాల నిబంధనలకు తోడు.. పరీక్ష ప్రిపరేషన్‌కు కేవలం 45 రోజులు గడువు ఇవ్వడం చాలా అన్యాయం అని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షలు నెలరోజులు....

డీఎస్సీ పరీక్ష నిర్వహణ జూన్ 6 నుంచి జులై 6వ తేదీ వరకు చేపట్టనున్నారు. అంటే నెల రోజుల పాటు నిర్వహించనున్నారు.కంప్యూటర్ బేస్డ్ టెస్టు(సీబీటీ విధానం) విధానంలో నిర్వహించనున్నారు. సీబీటీ విధానంలో నెల రోజులపాటు పరీక్షలను నిర్వహించడంతో ఒక రోజు పరీక్ష సులభంగా వస్తే మరో రోజు పరీక్ష కఠినంగా వచ్చే అవకాశం ఉంటుంది. దీంతో కొంతమంది అభ్యర్థులకు మంచి జరిగితే మరికొంత మందికి ఇబ్బంది జరిగే అవకాశం ఉండటంపై అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఒక్కరోజులోనే డీఎస్సీ పరీక్షను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించేవారు. ఇలాంటిది ఈసారి నెల రోజులపాటు సీబీటీ విధానంలో నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెతుతున్నాయి. ఉద్దేశపూర్వకంగా ఏదో ఒక మెలిక పెట్టాలనే ఇలా నిర్వహిస్తున్నారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

జిల్లాలో ఖాళీ పోస్టుల వివరాలు

సబ్జెక్టు	ప్రభుత్వ.	జెడ్పీ	మున్సిపల్ కార్పొరేషన్	మొత్తం
ఎస్‌ఏ సంస్కృతం	–	–	01	01
ఎస్‌ఏ తెలుగు	26	–	–	26
ఎస్‌ఏ ఉర్దూ	06	–	01	07
ఎస్‌ఏ హిందీ	16	01	01	18
ఎస్‌ఏ ఇంగ్లీస్	78	01	02	81
ఎస్‌ఏ మ్యాథ్స్(టీఎం)	42	–	01	43
ఎస్‌ఏ మ్యాథ్స్(యూఎం)	–	01	–	01
ఎస్‌ఏ పీఎస్(టీఎం)	28	–	–	28
ఎస్‌ఏ పీఎస్(యూఎం)	02	–	01	03
ఎస్‌ఏ బీఎస్(టీఎం)	49	02	–	51
ఎస్‌ఏ బీఎస్(యూఎం)	02	–	–	02
ఎస్‌ఏ ఎస్ఎస్(టీఎం)	58	1	1	60
ఎస్‌ఏ ఎస్ఎస్(యూఎం)	05	–	–	05
ఎస్‌ఏ పీఈ	77	01	04	82
ఎస్‌జీటీ (టీఎం)	219	21	12	252
ఎస్‌జీటీ(యూఎం)	31	07	07	45
మొత్తం	639	35	31	705

టీఎం: తెలుగు మీడియం... యూఎం: ఉర్దూ మీడియం

గడువు పెంచాలి



డీఎస్సీ పరీక్షకు ప్రభుత్వం కేలవం 45 రోజులే గడువుఇచ్చింది. ఈ గడువు ప్రిపరేషన్‌కు సరిపోదు. ప్రభుత్వం స్పందించి ఈ గడువును 90 రోజులకు పెంచితే బాగుంటుంది. ఉద్యోగం తెచ్చుకునేందుకు అవకాశం ఉంటుంది.
– మహబూబ్‌పీర్, డీఎస్సీ అభ్యర్థి

ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలి



డీఎస్సీ దరఖాస్తు చేసుకునే సమయంలో దరఖాస్తులో ఎడిట్ ఆప్షన్ ఇవ్వలేదు. దరఖాస్తు చేసుకునే సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించి ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలి.
– రుతు, డీఎస్సీ అభ్యర్థి

ఒకే పరీక్షగా నిర్వహించాలి



డీఎస్సీ పరీక్షను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో కాకుండా ఒకే రోజు నిర్వహించాలి. సీబీటీ విధానంలో పరీక్ష రోజులు తరబడి నిర్వహిస్తారు. ఇలా నిర్వహించడం వల్ల ఒక రోజు ప్రశ్నపత్రం సులభంగా వస్తే మరో రోజు ప్రశ్నాపత్రం కష్టంగా వచ్చే అవకాశం ఉంటుంది. దీంతో కొంతమందికి అన్యాయం జరిగే ప్రమాదం ఉంది. ఒకే రోజులో పరీక్ష నిర్వహించాలి.
– అమరావతి, డీఎస్సీ అభ్యర్థి

సజావుగా ఇసుక పంపిణీ ప్రక్రియ

– కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇసుక పంపిణీ ప్రక్రియ సజావుగా జరగాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో ఇసుక బుకింగ్, సరఫరా, ఇసుక లభ్యత వంటి అంశాలపై ఎస్పీ అశోక్ కుమార్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌లతో కలసి జిల్లా స్థాయి సాండ్ కమిటీ (డీఎల్ఎస్‌సీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. ఉచిత ఇసుక విధానంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఇసుక రీచుల వద్ద ఎంత క్వాంటిటీ బుక్ చేసుకుంటున్నారు. ఎంత నిల్వ ఉంటుంది రోజువారి డేటాను రికార్డును తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. పర్యవేక్షణ, జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడానికి వీఆర్వోలు, వీఆర్ఏ లను లేదా అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ అధికారులను పర్యవేక్షక ఇన్‌ఛార్జ్‌లుగా నియమించి ఇసుక రవాణాలో క్రమాలు జరగకుండా చూడాలన్నారు. జిల్లాలో 6 సెమి మెకనైజ్డ్ ఇసుక రీచుల నిర్వహణకు నోటిఫికేషన్ ఇవ్వాలని, అలాగే.. అదనంగా అందుబాటులో ఉన్న డిసిల్టేషన్ పాయింట్లను గుర్తించాలన్నారు. అలాగే ప్రతి స్టాక్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసే లా చూసుకోవాలన్నారు. అలాగే ఆర్డీవోలు తమ పరిధిలోని స్టాక్ రీచ్ లను తనిఖీ చేసి అక్కడి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించాలన్నారు. జెడ్పి సీఈఓ ఓబులమ్మ, గనులు భూగర్భ శాఖ డీడీ సూర్యచంద్రరావు, రీజినల్ ట్రాన్స్‌పోర్టు, పోలీస్ అధికారులు, గ్రౌండ్ వాటర్ , ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి స్పందించాలి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన స్పందించి నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభాభవన్ లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను నాణ్యతతో పరిష్కార నివేదికలు పంపాలన్నారు. అనంతరం అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, వెంకటపతి, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేవ..దేవా.. ఆదాయం స్వాహా!



గీతాశ్రమంలోని ఈఓ కార్యాలయం

- తక్కువ అద్దెకు భవనాల లీజు
- ఏడాదికి రూ.7లక్షలు నష్టం
- ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సిఫారసు
- మామూళ్ల మత్తులో దేవదాయశాఖ అధికారులు

ప్రొద్దుటూరు : దేవుడు చూడలేదు.. వినడలేదు.. ఏమీ చేయలేదు అని అనుకున్నారేమో కానీ.. దేవదాయశాఖ అధికారులు బరితెగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ దేవదాయ సంస్థకు లక్షలాది రూపాయల నష్టం కలిగిస్తున్నారు. ప్రొద్దుటూరు పట్టణంలోని గీతాశ్రమం దేవదాయశాఖ పరిధిలో ఉంది. సంస్థకు కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నాయి. ఆస్తులను పరిరక్షించేందుకు ప్రత్యేకంగా ఎగ్జిక్యూటివ్ అధికారిని నియమించారు అధికార పార్టీ అండతో అధికారులు అక్రమాలకు తెర తీశారు.

- లోకకల్యాణార్థం శ్రీకృష్ణ గీతాశ్రమాన్ని నామా ఎరుకులయ్య ఏర్పాటు చేశారు. ఈ ఆశ్రమాన్ని గతంలో గంగాధరానంద స్వామి నిర్వహిస్తుండగా అవినీతి ఆరోపణలు రావడంతో 2017లో దేవదాయశాఖ స్వాధీనం చేసుకుంది. కరోనా సమయంలో గంగాధరానంద స్వామి మరణానంతరం దేవదాయశాఖ ఈ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేకంగా ఎగ్జిక్యూటివ్ అధికారిని నియమించింది. గీతాశ్రమంలోని భవనాల్లో అనేక విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు నడుస్తున్నాయి. ఇందులో ఎంఎస్ శారద జూనియర్ కళాశాల ఒకటి. ఇందుకుగాను ప్రతినెల నామమాత్రపు అద్దెను చెల్లిస్తోంది. ఎంఎస్ శారద జూనియర్ కళాశాల యాజమాన్యం సక్రమంగా అద్దె చెల్లించకపోవడంతో ఈ కళాశాలకు భవనాలు లీజుకు ఇవ్వొద్దని గతంలో పనిచేసిన ఈఓ శంకర్‌బాలాజీ లిఖిత పూర్వకంగా దేవదాయశాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. 2021 జూలై 31వ తేదీ నాటికి ఎంఎస్ శారద జూనియర్ కళాశాల లీజు అగ్రిమెంట్ పూర్తయింది. తర్వాత అధికారులు బహిరంగ వేలం నిర్వహించాలని ప్రకటించగా తమకు 11 ఏళ్లకు భవనాలు లీజుకు కావాలని కాలేజీ యాజమాన్యం దేవదాయశాఖ అధికారులకు లేఖ రాశారు. అప్పటి వరకు రూ.16,500 బాడుగను రూ.21,945కు పెంచుతూ అధికారులు తీర్మానించారు.
- శ్రీకృష్ణ గీతాశ్రమంలోని 10,998.9 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న రెండు అంతస్తుల్లోని భవనాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం సుమారు రూ.88వేలు నెలకు అద్దె చెల్లించాల్సి ఉంది. కేవలం రూ.29వేలతో ఈ భవనాలను అధికారులు అద్దెకు ఇచ్చారు. ఇందులోని మొదటి అంతస్తులో ఉన్న 9వేల చదరపు అడుగుల భవనాలను తమకు అద్దెకు ఇస్తే రూ.60వేలు చెల్లిస్తామని గత ఏడాది సెప్టెంబర్ 23వ తేదీన ఒకరు, రూ.80వేలు ఇస్తామని 2021 జూలై 2న మరొకరు దేవాదాయశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వేలం నిర్వహించే సమయంలో తమకు తెలపాలని వారు కోరారు. ఇది ఇలా ఉండగా.. ఈ ఏడాది ఫిబ్రవరి 8న బహిరంగ వేలం ద్వారా ప్రస్తుతం నిర్వహిస్తున్న సంస్థలకే భవనాలను అద్దెకు కేటాయించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి బహిరంగ వేలం నిర్వహించలేదు. ఎవరు పోటీలో పాల్గొనలేదు. లోపాయికారి ఒప్పందం ప్రకారం ఈ భవనాలను ప్రస్తుత ఈఓ రామచంద్రాచార్యులు కేటాయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2016 మార్చి 7న జారీ చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 37 ప్రకారం స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న ప్రొద్దుటూరులో చదరపు అడుగుకు రూ.8 చొప్పున అద్దె చెల్లించాల్సి ఉంది. దేవాదాయశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏడాదికి రూ.7లక్షల వరకు నష్టం వాటిల్లినట్లయింది.
- ఎంఎస్ శారద జూనియర్ కళాశాల యాజమాన్యానికే గీతాశ్రమంలోని భవనాలను అద్దెకు ఇవ్వాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి గత ఏడాది ఆగస్టు 6న దేవాదాయశాఖ కమిషనర్‌కు సిఫారసు చేశారు. ఆ లేఖ ఆధారంగా కళాశాల యాజమాన్యం లబ్ధి పొందింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఈఓ రామచంద్రాచార్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగు నాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దేవాదాయశాఖ కమిషనర్‌కు ఇటీవల ఫిర్యాదు చేయడం గమనార్హం. అద్దె భవనాల కేటాయింపులో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని పలువురు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు.
- గతంలో గీతాశ్రమంలో కాంట్రాక్టు పద్ధతిలో అటెండర్‌గా పనిచేస్తున్న బి.జనార్దన్ రెడ్డి నడవడిక సరిగా లేకపోవడంతో అతనిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత ఈఓ రామచంద్రాచార్యులు విధుల్లో చేరిన తర్వాత జనార్దన్ రెడ్డిని తిరిగి తీసుకుని పెద్దపీట వేశారు. పైగా అతన్ని తొలగించినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.5లక్షలు వేతన బకాయిలను ఇవ్వడం ఆశ్చర్యంగా ఉంది. ఈ విషయంపై ఈఓ రామచంద్రాచార్యులును వివరణ కోరగా తాను విధుల్లో చేరిన తర్వాత బహిరంగ వేలమే నిర్వహించలేదని, ఎవరిని విధుల్లోకి తీసుకోలేదని తెలిపారు.

ఆపుకోలేని ఆవేదనకు బ్రేక్!

- లోకోపైలట్లను కరుణించిన రైల్వేశాఖ
- రైలింజన్‌లోనే యూరినల్స్, ఏసీ, ఎర్గోనామిక్ సీట్లు
- తొలుత గూడ్స్ రైళ్లలో ఏర్పాటుదిశగా చర్యలు

డివిజన్ : గుంతకల్
లోకోపైలెట్స్ : 2500
రన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్ : తిరుపతి, రేణిగుంట, నందలూరు, ఎర్రగుంట్ల, గుత్తి, గుంతకల్లు.





లోకోపైలట్స్ (ఇన్‌సెట్) యూరినల్స్ కోసం లోకోమోటివ్‌లో ఏర్పాటుచేసిన టాయిలెట్

రాజంపేట : ఆపుకోలేని ఆవేదనకు రైల్వేశాఖ బ్రేక్ వేసింది..ఇదేంటబ్బా అనుకోవచ్చు.. విధి నిర్వహణలో రైలింజన్ నడిపే లోకోపైలెట్స్, అసిస్టెంట్ లోకోపైలట్స్ యూరినల్స్ తదితర సమస్యలు ఉత్పన్నమైతే ఇబ్బందులు పడాల్సి వచ్చేది. లోకోపైలట్స్ ఒక్కోసారి నీళ్లు తాగటానికి ఒకటికి నాలుగు సార్లు ఆలోచించే పరిస్థితి..మూత్ర విసర్జనకు వెళ్లాంటే రైలు ఆగే స్టేషన్ రాకకోసం ఎదురుచూడాల్సిందే. అందుకు ఒక్కోసారి ఐదారు గంటలు కూడా పట్టొచ్చు.. మహిళాలోకోపైలట్లు చాలా అవస్థలు పడేవారు.ఈ సమస్యను పరిష్కరించాలని ఇంతకాలానికి రైల్వేశాఖ ముందడుగు వేసింది. రైలింజన్ క్యాబిన్‌లో యూరినల్స్, ఏసీవసతి, ఆధునిక ఎర్గోనామిక్ సీట్ల ఏర్పాట్లను తప్పనిసరి చేసింది. దీంతో ఎల్‌పీ,ఎల్‌పీలకు పెద్ద ఉపశమనం లభించనుంది.రైల్వేశాఖ నిర్ణయంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- కొత్తగా తయారుచేసే అన్ని లోకో క్యాబిన్లలో యూరినల్స్, ఏసీ, ఎర్గోనామిక్‌సీట్లు ఏర్పాటు కోసం వాటి డిజైన్లను రైల్వేశాఖ మార్చింది. ఇప్పటికే వినియోగిస్తున్న లోకోమోటివ్‌లలో వాటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఆదేశించింది. గుత్తి, విజయవాడ, లాలాగూడా, మౌలాలి, లోకోషెడ్లను ఈ పనులు ప్రారంభించారు. తొలుత గూడ్స్‌రైళ్లలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 42 లోకోమోటివ్‌లలో ఏర్పాటుచేశారు. ఇంజిన్‌ను పరిశీలించేందుకు వీలుగా అన్ని కారిడార్ చిన్న క్యాబిన్ ఏర్పాటుచేసి ,అందులో యూరినల్స్ కమోడ్ ఏర్పాటుచేస్తున్నారు. లోకోమోటివ్‌లో నీటి వసతి ఉండదు. కాబట్టి టాయిలెట్ కాకుండా యూరినల్స్ వసతి మాత్రమే ఏర్పాటుచేస్తున్నారు.

క్లీనింగ్ ప్రశ్నార్థకరం..

సాధారణ కోచ్ నాలుగురోజులకొకసారి స్పెషల్ క్లీనింగ్‌కు షెడ్డుకు వెళుతుంది. అప్పుడు అందులోని మానవ వ్యర్థాలను తొలగిస్తారు. కానీ లోకోమోటివ్ 90రోజులకొకసారి మాత్రమే షెడ్డుకు వెళుతుంది. అప్పటి వరకు వ్యర్థాలను నిల్వ ఉంచలేరు. లోకోమోటివ్ కంపు కొడుతుందని ఎల్‌పీలు అంటున్నారు. దీంతో క్లీనింగ్ ప్రశ్నార్థకరంగా మారింది.

ఎర్గోనాటిక్ సీట్లు...

గతంలో 90 డిగ్రీల కోణంలో సీట్లు ఉండేవి. ఇవి ఏమాత్రం అనుకూలంగా ఉండేవి కాదు. వీటిల్లో ఎక్కువ గంటలు కూర్చొని పనిచేస్తే నడుము, వెన్నముక నొప్పులొస్తున్నాయనే ఆరోపణలున్నాయి. రైల్వే శాఖకు ఫిర్యాదులు వెళుతున్నాయి. మహిళా సిబ్బంది మరింత ఇబ్బందికి గురవుతున్నారు. ఇప్పుడు వీటి స్థానంలో ఎర్గోనామిక్ సీట్లను ఏర్పాటుచేస్తున్నారు.

దశాబ్దాల సమస్యకు పరిష్కారం



దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించింది. రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. యూరినల్స్‌కే పరిమితం కాకుండా, టాయిలెట్ వసతి కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుంది.
– సూర్యరావు, లోకోపైలట్, రేణిగుంట

టాయిలెట్ వసతి ఏర్పాటు అవసరం



లోకోమోటివ్స్‌లో యూరినల్స్‌తో టాయిలెట్ వసతి ఏర్పాటు అవసరం ఎంతైనా ఉంది. యూరినల్స్ ఏర్పాటు విషయంలో రైల్వేశాఖ తీసుకున్న నిర్ణయ హర్షణీయం. ఎల్‌పీ,ఎఎల్‌పీలు పడే ఇబ్బందులు తొలుగుతాయి. విధి నిర్వహణలో ఇక ఆపుకోనక్కరలేదు.
– రామకృష్ణ, లోకోపైలట్, నందలూరు

ఇబ్బందులు తొలగుతాయి



విధి నిర్వహణలో మేము పడే ఇబ్బందులను రైల్వేశాఖ అర్థం చేసుకుంది. సానుకూలంగా నిర్ణయం తీసుకుంది. ఇక ఇబ్బందులు తొలగుతాయి. చాలా సంతోషంగా ఉంది. లోకోమోటివ్‌లో ఏసీ, ఎర్గోనామిక్స్ సీట్ల ఏర్పాటుపై దృష్టి సారించడం అభినందనీయం.
– డీ.సురేష్‌బాబు, లోకోపైలట్, నందలూరు

ఘర్షణ ఘటనలో 17 మందిపై కేసు

వేంపల్లె : మండలంలోని నందిపల్లెలో జరిగిన ఘర్షణ కేసులో ఇరువర్గాలకు చెందిన 17 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు. ఆదివారం రాత్రి నందిపల్లె గ్రామంలో జరిగిన భార్యాభర్తల పంచాయితీలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. దీంతో ఇరువర్గాల్లో ఉన్నవారికి గాయాలు కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సీఐ నరసింహులు ఇరు వర్గాలకు చెందిన 17 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. భర్త తరఫున నందిపల్లెకు చెందిన మునవర్, అన్వర్ , మారం శ్రీకాంత్ రెడ్డితోపాటు 6మందిపై కేసు నమోదు కాగా, నేలతిమ్మయ్యగారిపల్లెకు చెందిన పెద్ద బాదుల్లా, చిన్న బాదుల్లా, అబ్దుల్‌లతోపాటు మరో ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వడదెబ్బకు వృద్ధురాలి మృతి


మృతి చెందిన రామసుబ్బమ్మ

కొండాపురం : మండల పరిధిలోని ఎస్. తిమ్మాపురం గ్రామానికి చెందిన గోసువారిపల్లె రామసుబ్బమ్మ(77) సోమవారం వడ దెబ్బతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. రోజు మాదిరిగానే సోమవారం గ్రామంలో వ్యవసాయ కూలి పనికి వెళ్లింది. ఎండ తీవ్రంగా ఉండటంతో కూలి పనులు చేస్తుండగానే సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే తోటి కూలీలు కొండాపురం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది.

రిమ్స్‌ను వీడని నిర్లక్ష్యపు జబ్బు!



ఉదయం 9:39 అయినా గైనకాలజీ విభాగంలోని ఓ గదిలో డాక్టర్లు లేక ఖాళీగా కనిపిస్తున్న కుర్చీ



ఉదయం 9:42 అయినా డాక్టర్లు రాని పురుషుల ఎముకల ఓపీ విభాగం


ఓపీ విభాగంలో 'ఏబీహెచ్‌ఏ' అప్‌లోడ్ కోసం ఎదురు చూస్తున్న రోగులు, వారి సహాయకులు


ఓపీ విభాగం ముందు 'ఆక్వాప్యూర్' వాటర్ క్యాన్‌ల ఆటో

- ఓపీలోని కొన్ని విభాగాల్లో సమయం పాటించని డాక్టర్లు
- 'ఏబీహెచ్‌ఏ'(ఆభా) అప్లికేషన్ అప్‌లోడ్ కోసం తప్పని నిరీక్షణ
- వార్డుల్లో కొందరు డాక్టర్లు, హెడ్ నర్సుల కాలక్షేపం
- ఇంతవరకు పరిష్కారం కాని నీటి సమస్య

కడప టాస్క్‌ఫోర్స్ : జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకమైన కడప రిమ్స్ ఆసుపత్రిలో అడుగడుగునా నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రోగులకు సేవ చేసేందుకే తాము విధుల్లో ఉన్నామనే కనీస బాధ్యతను విస్మరించి కొందరు వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పేద రోగులంటే వారి దృష్టిలో మనుషులు కాదన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. గతంలో రిమ్స్ దుస్థితిపై పత్రికల్లో కథనాలు వెలువడినా అధికారుల్లో కనీస చలనం లేదు. తాజాగా సోమవారం కూడా ఇదే పరిస్థితి కనిపించింది. ఎముకల విభాగం, గైనకాలజీ విభాగాల్లో వైద్యుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఉదయం 9:40 గంటల సమయమైనా ఓపీలో డ్యూటీ డాక్టర్లు లేకపోవడం గమనార్హం. రకరకాల సమస్యలతో బాధపడుతూ వైద్యం కోసం వ్యయప్రయాసలకోర్చి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు వైద్యుల కోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. కొన్ని విభాగాలలో పీజీలు, హౌస్ సర్జన్‌లకే వైద్య పరీక్షల సేవలను అప్పగించి వైద్యులు మాత్రం కళాశాల వద్దకో, లేక వార్డులకో వెళ్లినట్లుగా చెప్పుకొస్తున్నారు. వీరిలో చాలామంది బయోమెట్రిక్, ఎఫ్ఆర్ఎస్‌లను వేసి, కడప నగరంలోని తమ సొంత క్లినిక్‌లకు వెళ్లిపోతున్నారనే ఆరోపణలున్నాయి.

■ ఏబీహెచ్ఏ (అభా) అప్లికేషన్‌ను రోగులు, వారి బంధువుల 'ఆండ్రాయిడ్' ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేయించే విషయంలో అక్కడి సిబ్బందికి శిక్షణ ఇవ్వడం కానీ, లేక సులువుగా అప్లికేషన్ పొందుపరిచే విషయంలోగానీ సంబంధిత మెడికల్ ఆఫీసర్లుగానీ, ఇతర వైద్య సిబ్బందిగానీ పట్టించుకోవడం లేదు. దీంతో ఓపీ చీటీల కౌంటర్ వద్ద కొన్ని అడుగుల దూరం రోగులు, వారి సహాయకులు వేయాలంటేనే అరగంట నుంచి గంట సమయం పడుతోంది. ఓపీ, ఐపీ విభాగాలలో విధులను నిర్వహిస్తున్న డీఈఓలు 6 మంది, స్టాఫ్ నర్స్ పోస్టులలో ఎంపికై డీఈఓలుగా విధులు నిర్వహిస్తున్న వారు 13 మందిలో కొందరు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తమ సమయపాలన పాటించాల్సి ఉంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 లేక 12:30 గంటలకే తమ విధులను 'మమ' అనిపించుకుంటున్నారు. ఓపీ వేళలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మరలా 2 గంటల నుంచి 4 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉంది. మధ్యాహ్నం ఓపీ వేళలలో కొందరు డాక్టర్లు, డీఈఓలలో కొందరు ఎఫ్ఆర్ఎస్, బయోమెట్రిక్ సమయాలలో అంటే సాయంత్రం 4 గంటలకు వచ్చి ఆ ప్రక్రియ ముగించుకుని తమదారిన తాము వెళ్లిపోతున్నారు. వీరిపై పర్యవేక్షించాల్సిన అధికారులు మాత్రం 'పక్కా' ఆధారాలుంటే చూపించండి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

■ వార్డులలో విధులను నిర్వహిస్తున్న డాక్టర్లలో కొందరు, స్టాఫ్, హెడ్ నర్సులలో కొందరు నిక్కచ్చిగా తమకు కేటాయించిన విధులను నిర్వహిస్తుంటే, మరికొందరు మాత్రం 'నామమాత్రంగా' విధులను నిర్వహిస్తున్నారు. హెడ్ నర్సులు సమయపాలన పాటించకపోవడం, తమకు కేటాయించిన వార్డులన్నీ పరిశీలించకుండానే ఒకే చోట కూర్చుని రికార్డులను తెప్పించుకుని 'కాలక్షేపం' చేస్తున్నారు.

■ జీజీహెచ్ రిమ్స్‌కు వచ్చే రోగుల, వారి సహాయకులు దాహార్తిని తీర్చే విషయంలో ఇంకా అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. కడప నగర పాలక సంస్థ నుంచి ఒప్పందం ప్రకారం రిమ్స్‌కు సరఫరా చేయాల్సిన 2లక్షల గ్యాలన్ల నీటిని ప్రతి రోజు సక్రమంగా సరఫరా చేయడం లేదు. నాలుగు రోజులకు ఒకసారి కూడా ఈ నీటిని సరఫరా చేయకపోవడం గమనార్హం. ఈ ఒప్పందాన్ని తుంగలో తొక్కి కొందరు వాటర్‌మాన్‌లు ఈ నీటిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, నీటి వ్యాపారులకు అప్పనంగా అమ్మేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

■ కడప సెంట్రల్ ల్యాబ్ విభాగాలలో సామగ్రిని తీసుకుని రావడంలో పారామెడికల్ కోర్సులలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులే ఫార్మసీ విభాగం నుంచి తీసుకుని వస్తున్నారు. ల్యాబ్ విభాగాలలో విధులను నిర్వహిస్తున్న అటెండర్లు వారికి కేటాయించిన విధులలో కాకుండా ఇతర విభాగాలలో పనిచేస్తున్నారు. రిమ్స్‌ను పట్టి పీడిస్తున్న నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రొద్దుటూరు డీఎస్పీ అవినీతికి అంతేలేదు

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు డీఎస్పీ భావన అవినీతికి అంతే లేకుండా పోయిందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆరోపించారు. మద్యం షాపులు, బార్ల యజమానులతో మామూళ్లు వసూలు చేస్తున్నారని తెలిపారు. టీడీపీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల క్రికెట్ బెట్టింగ్ నిర్వహణపై దాడులు నిర్వహించి అక్రమంగా కొందరిని కేసుల్లో చేర్చారన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన నరసింహ అనే క్రికెట్ బుకీ ప్రస్తుతం ఇక్కడ లేడని, ఎక్కడో ఉన్నాడని తెలిపారు. అయితే అతన్ని పట్టుకుంటే రూ. లక్షలు వస్తాయనే దురుద్దేశంతో రాష్ట్రంలోని ఒక పోలీసు అధికారి స్థానికంగా ఉన్న నరసింహ బావ మునివరపై కేసు పెట్టమని చెప్పారన్నారు. దీంతో నరసింహతో పాటు మునివరపై కేసు పెట్టారన్నారు. అయితే మునివర 15 ఏళ్ల నుంచి క్రికెట్ బెట్టింగ్ నిర్వహించలేదని ఎమ్మెల్యే తెలిపారు. మునివర, అతని భార్య సెల్ ఫోన్లలోని కాల్‌డేటాను పరిశీలించి క్రికెట్ పందేలు నిర్వహించాడేమో నిర్ధారించుకోవాలన్నారు. మునివర బెట్టింగ్ ఆడినట్లు నిరూపిస్తే తానే క్షమాపణ చెబుతానని ఎమ్మెల్యే అన్నారు. ప్రొద్దుటూరు డీఎస్పీ ఇక్కడికి వచ్చి 3 నెలలు కూడా కాలేదని, వచ్చిన నాటి నుంచే విపరీతమైన లంచాలకు పాల్పడుతున్నట్లు ఆయన ఆరోపించారు. ప్రొబెషనరీ పీరియడ్ పూర్తి కాకముందే డీఎస్పీ అవినీతికి పాల్పడుతున్నారని తెలిపారు. ఇటీవల బొల్లవరంలో నాలుగు ఇళ్లలో చోరీ జరిగిందని, సుమారు రూ. 1 కోటి మేర సొత్తు పోయిందన్నారు. ఇంత పెద్ద చోరీ జరిగితే డీఎస్పీ కనీసం అక్కడికి చూసేందుకు కూడా వెళ్లలేదని తెలిపారు. పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ప్రొద్దుటూరు డీఎస్పీ అవినీతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తెలిపారు.

రేషన్ బియ్యం లారీని వదలడానికి మీరెవరు..?

ఇటీవల జమ్మలమడుగు నుంచి 650 బస్తాల రేషన్ బియ్యంతో వస్తున్న లారీని ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు సీజ్ చేశారని ఎమ్మెల్యే తెలిపారు. అయితే రెండు రోజుల తర్వాత జమ్మలమడుగు తహసీల్దార్ బిల్లులు పంపిస్తే పోలీసులు వదిలేశారన్నారు. ప్రొద్దుటూరులో బియ్యం లారీ పట్టుకుంటే జమ్మలమడుగు తహసీల్దార్ బిల్లులు పంపిస్తే ఎలా వదిలేస్తారని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో టీడీపీ నాయకులు కొర్రపాడు రామచంద్రారెడ్డి, గురివిరెడ్డి పాల్గొన్నారు.

మాయ మాటలతో బంగారం చోరీ

నిందితులను అరెస్టు చేసిన పోలీసులు


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు : పట్టణంలో ఎస్సీ కాలనీలో కరపాకుల సుజాత అనే మహిళకు మాయ మాటలు చెప్పి బంగారాన్ని చోరీ చేసిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి పది తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం అర్బన్ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నంద్యాల జిల్లా సిరివెళ్ల గ్రామానికి చెందిన ముర్రిర్నే కనకమ్మ, ఆమె భర్త శ్రీనివాసులు గత నెల 24వ తేదీన జమ్మలమడుగు ఎస్సీ కాలనీలో ఉన్న సుజాత ఇంటికి వెళ్లి అనారోగ్యం తొలగాలంటే ఇంట్లో పూజలు చేయాలని నమ్మించారు. సుజాత చేత ఆమె ఇంట్లో ఉన్న బంగారం లాంగ్‌చైన్, రెండు బంగారం కడియాలు, హారం మొత్తం 10 తులాల బంగారాన్ని పెట్టేలో బియ్యం పోసి అందులో పెట్టించారు. పూజలు చేసే సమయంలో పెట్టెలు మార్చేశారు. సాయంత్రం వరకు పెట్టెను తెరవద్దు అని చెప్పి వారు వెళ్లిపోయారు. సాయంత్రం సుజాత ఆమె భర్త చంద్రశేఖర్‌లు బియ్యం పెట్టెను తెరిచి చూశారు. అందులో బంగారం లేకపోవడంతో మోసపోయామని గ్రహించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ లింగప్ప ఆధ్వర్యంలో ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది దేవదాసు, రియాజ్ ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టి నిందితులను గుర్తించారు. వీరపునాయునిపల్లి, వేంపల్లి ప్రాంతాలలో కూడా ఇదే తరహాలో చోరీలు చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. ప్రస్తుతం వీరిని అరెస్టు చేసి వారి వద్దనుంచి పదితులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు.

భూములు కొనలేం.. లీజుకు మాత్రమే తీసుకుంటాం

సేల్ యాజమాన్యం స్పష్టీకరణ


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

జమ్మలమడుగు : సోలార్ పరిశ్రమ కోసం తాము భూములను రైతుల వద్దనుంచి కొనలేము. ఏడాదికి 32 వేల రూపాయలు కౌలుతో పాటు అడ్వాన్సుగా రెండు లక్షల రూపాయలు రైతులకు ఇస్తాము. దీనికి సానుకూలంగా ఉన్న రైతుల నుంచి భూములను తీసుకుంటాము.. అని సోలార్ కంపెనీ ప్రతినిధులు రైతులకు స్పష్టం చేశారు. సోమవారం పెద్దముడియం మండలం తహసీల్దార్ కార్యాలయంలో కల్వటాల గ్రామానికి చెందిన డీకేటీ పట్టాలు కలిగిన రైతులతో తహసీల్దార్ నరసింహులు సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సరైన గిట్టుబాటు ధరతో భూములు కొనుగోలు చేస్తే తాము తమ భూములను సోలార్ కంపెనీకి ఇచ్చేందుకు సిద్ధమని తెలిపారు. అయితే యాజమాన్యం మాత్రం ప్రస్తుత పరిస్థితుల్లో తాము భూములను కొనుగోలు చేయలేమని లీజుకు మాత్రమే తీసుకుంటామన్నారు. దీంతో రైతులు కూడా ఆలోచించి చెబుతామని వెళ్లిపోయారు.

మాకు న్యాయం చేయాలి..

తమకు పట్టాలు లేవు. అయితే భూములను అనుభవంలోకి తెచ్చి సాగు చేసుకుంటున్నామని తమకు న్యాయం జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కల్వటాల గ్రామానికి చెందిన రైతులు తహసీల్దార్ నరసింహులుకు వినతి పత్రం ఇచ్చారు. కొండ భూములను తాము చదును చేసుకోవడంతో పాటు భూమిగా మార్చుకోవడం కోసం భూమిపై ఎంతో ఖర్చు పెట్టామన్నారు. ప్రస్తుతం సోలార్ కంపెనీకి తమ భూములు కేటాయిస్తే తాము అన్యాయమైపోతామని వారు వాపోయారు. ఈ కార్యక్రమంలో సోలార్ కంపెనీ ప్రతినిధి నరేస్ చౌదరి, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్‌రెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం.. మేము చెప్పినట్లే జరగాలి

- పులివెందుల టీడీపీలో వర్గపోరు
- బీటెక్ రవి, రాంగోపాల్ వర్గీయుల మధ్య విభేదాలు

సాక్షి టాస్క్ ఫోర్స్ : పులివెందుల నియోజకవర్గంలో కూటమి నేతల అరాచకాలకు అడ్డు లేకుండా పోయింది. అందులో ముఖ్యంగా బీటెక్ రవి అనుచరులకు మితిమీరి ప్రవర్తిస్తున్నారు. కాదేది మాకు అనర్హమంటూ విపరీతంగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా తమ పార్టీకి చెందిన నేతలను సైతం భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తాము చెప్పిందే వేదం తాము చేసేది న్యాయం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. వీరికి పోలీసులు పూర్తి వత్తాసు పలుకుతున్నారు.

పనుల కోసం పంతాలు..

తాజాగా పులివెందుల నియోజకవర్గం వేముల మండలం వేల్పుల గ్రామం వద్ద ఆదివారం రాత్రి అధికార పార్టీ నాయకుల మధ్య గొడవ జరిగింది. విశ్వసనీయ సమాచారం మేరకు వేముల మండలం వేల్పుల గ్రామం వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు జరుగుతున్నాయి. దానికి సంబంధించి మట్టిని అధికార పార్టీకి చెందిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల రాఘవరెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి సరఫరా చేస్తున్నాడు. ఈ మట్టిని కూడా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పెద్దజూటూరు గ్రామ పరిసరాలలో కొండ, గుట్టలను తవ్వి సరఫరా చేస్తున్నాడు. అయితే ఇక్కడే అధికార పార్టీ నాయకులకు ఉకలుకలు మొదలయ్యాయి. కృష్ణారెడ్డి మట్టి సరఫరాను జీర్ణించుకోలేని బీటెక్ రవి వర్గం అంటే వేముల పార్థసారథి రెడ్డి వర్గమైన సుధాకర్ రెడ్డి ఈ పనులను అడ్డుకున్నారు. తమ ప్రాంతంలో మట్టి సరఫరా చేయడానికి మీరు ఎవరు అంటూ గట్టిగా వారిని నిలదీశారు. ఈ ప్రాంతంలో ఏమైనా మేమే చేయాలంటూ వారికి గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. ఆదివారం రాత్రి కృష్ణారెడ్డికి చెందిన మట్టి తరలించే వాహనాలను సుధాకర్ రెడ్డి వర్గం అడ్డుకుంది. దీంతో కృష్ణారెడ్డి సోదరుడైన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాఘవరెడ్డి అనుచరులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య కవింపు చర్యలు జరిగాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను శాంతింప చేసే ప్రయత్నాలు చేశారు. దీనిపై తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు బీటెక్ రవివర్గం చేస్తున్న అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని అధిష్టానానికి ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

పాత కడప ఎస్సీల భూ సమస్యలు పరిష్కరించాలి


ధర్నాలో మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : పాత కడప ఎస్సీల భూ సమస్య పరిష్కరించి న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని రాయలసీమ కమ్యూనిస్టుపార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవి శంకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాత కడప ఎస్సీలకు 1993లో చిన్నచౌకు పొలం సర్వే నెంబర్లు 1045, 1046లలోని కొండ పోరంబోకు భూమిని అప్పటి అధికారులు పట్టాలు, పాసు బుక్కులు ఇచ్చారని తెలిపారు. అప్పటి నుంచి ఎస్సీలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. అక్కడి కొంతమంది పెత్తందారులు ఆ భూములపై కన్నేసి అధికారుల వత్తాసుతో తప్పుడు పత్రాలు చూపిస్తూ ఎస్సీలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. భూముల్లోకి వెళ్లనీయకుండా పోలీసులను అడ్డుపెట్టుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికే పలుమార్లు కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లినా అధికారులు సాచివేత ధోరణి అవలంబిస్తున్నారన్నారు. దళితులను వారి భూముల్లోకి వారు వెళ్లే విధంగా రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు మగ్బూల్‌బాషా, లక్ష్మీదేవి, సుబ్బరాయుడు, తస్లీమ్, దళిత గిరిజన హక్కుల పోరాట సమితి నాయకులు వెంకటేశు, నిత్య పూజయ్య, శేఖర్, ఓబులేశు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూ పంపిణీ చేయాలి


కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : గ్రామీణ పేదల వలసలు నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారికి భూ పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్, దాసరి వెంకటేశ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆ సంఘం నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామీణ పేదలకు భూ పంపిణీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కూటమి పార్టీలకు చెందిన వ్యక్తులు జిల్లాలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని దొంగ పట్టాలు, పాసు పుస్తకాలు పొంది అనుభవిస్తున్నారని ఆరోపించారు. పేదలు ఎక్కడైనా ఒక ఎకరా ప్రభుత్వ భూమిని దున్నుకుంటే వెంటనే రెవెన్యూ, పోలీసులు వచ్చి కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకటేశు, వీరయ్య, నరసయ్య, సురేష్‌బాబు, సరస్వతి, పుష్పమ్మ, చంద్రమ్మ, జహీరాబీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ దాడి చేయడంతో గుండెపోటు

జమ్మలమడుగు : పెద్దముడియం ఎస్ఐ సుబ్బారావు కొట్టడం వల్ల ఓ వ్యక్తి గుండెపోటుకు గురయ్యాడు. బాధితుడి బంధువుల కథనం మేరకు.. సోమవారం రాత్రి పెద్దముడియం మండలం మేడిదిన్నె గ్రామానికి చెందిన సుంకన్నపై ఎస్ఐ సుబ్బారావు అకారణంగా దాడి చేయడంతో గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. దీనిపై ఎస్ఐ సుబ్బారావును వివరణ కోరగా తమకు ఎలాంటి సంబంధం లేదని గ్రామంలో వివాహేతర సంబంధాల విషయమై వారు కొట్టుకున్నారన్నారు. గొడవ పెద్దది కాకుండా తాము తీసుకుని వచ్చామే కాని ఎవరిపైనా చేయి చేసుకోలేదని చెప్పారు.

పాఠశాల గుర్తింపు రద్దు

కడప ఎడ్యుకేషన్ : కమలాపురం పట్టణంలోని స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ 6 నుంచి 10వ తరగతులకు సంబంధించిన గుర్తింపును రద్దు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్ తెలిపారు. తల్లిదండ్రులు ఈ పాఠశాల నుంచి తమ పిల్లల ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ తీసుకొని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చేర్పించుకోవాలని సూచించారు.

వక్ఫ్ చట్టం రాకముందే కార్పొరేట్లకు లీజులు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ సుభాన్

కడప సెవెన్‌రోడ్స్ : వక్ఫ్ బిల్లు చట్టంగా రాకముందే కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ఆస్తులను 99 ఏళ్ల లీజుకు కట్టబెట్టే యత్నాలు చేస్తోందని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ సుభాన్ విమర్శించారు. సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షతన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ధార్మిక బోర్డులలో పరమతస్తులను నియమించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. జస్టిస్ సచార్ కమిటీ ముస్లిం ధార్మిక సంస్థల ఆస్తుల రక్షణకు చేసిన ప్రతిపాదనల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. దస్తావేజులు లేవని బై యూజర్ పేరిట వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకోవడం తగదన్నారు. బిల్లు చట్టంగా మారకమునుపే 52 బడా కార్పొరేట్ సంస్థలకు ప్రధాన నగరాల్లోని విలువైన ఆస్తులను అప్పగించాలని కేంద్రం చూస్తోందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కన్వీనర్ డబ్ల్యు రాము, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా అధ్యక్షుడు ఓబయ్య, ఏపీ దళిత మిత్ర సంఘం అధ్యక్షుడు కైపు రామాంజనేయులు, ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు పఠాన్ చాంద్‌బాషా, లోక్‌సత్తా నాయకుడు దేవర శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు


బండలాగుతున్న ఎద్దులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీ ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి రమేష్ బాబు(తాడిపత్రి), ద్వార్శల గురివిరెడ్డి (ప్రొద్దుటూరు) ఎద్దులు 1949.06 అడుగులు లాగి రూ.1.00,116, ద్వితీయ బహుమతి మార్తల చంద్ర ఓబుళరెడ్డి (చౌటపల్లె) ఎద్దులు 1806.04 అడుగులు లాగి రూ.75,116, తృతీయ బహుమతి రామసుబ్బారెడ్డి (హుస్సేనాపురం), చిన్న నాగన్న (పీఆర్‌పల్లె, నంద్యాల జిల్లా) 1640.07 అడుగులు లాగి రూ.50,116 నగదు అందుకున్నారు. గెలుపొందిన ఎడ్ల యజమానులకు నగదు బహుమతులు అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజారెడ్డి, ఈఓ శ్రీధర్, దాతలు, భక్తులు పాల్గొన్నారు.